ప్రజాశక్తి
గురువారం 24 నవంబర్ 2022



'పది' పరీక్ష ఫీజు చెల్లింపునకు 10 వరకు అవకాశం

అనంతపురం కలెక్టరేట్ : పదోతరగతి 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించే తేదీని ప్రభుత్వం ఖారారు చేసింది. ఈ మేరకు అనంతపురం జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.వెంకట క్రిష్ణారెడ్డి బుధవారం ఆ వివరాలను వెల్లడించారు. పది పరీక్షలకు ఈ నెల 25వ తేదీ నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ప్రధానోపాధ్యాయులు ద్వారా విద్యార్థులు ఫీజులు చెల్లించాలన్నారు. ఎన్ఆర్, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. అపరాధ రుసుం రూ.50తో డిసెంబర్ 11 నుంచి డిసెంబర్ 20వ తేదీ వరకు, రూ.200 రుసుంతో డిసెంబర్ 21 నుంచి 25వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబర్ 26 నుంచి డిసెంబర్ 30వ తేది వరకు చెల్లించవచ్చున్నారు. ప్రధానోపాధ్యాయులు ఎంఎన్ఆర్, ఇతర వివరాలను డిసెంబర్ 20 నుంచి డిసెంబర్ 31వ తేదీలోగా జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి అందజేయాలన్నారు. పరీక్ష ఫీజు పదోతరగతి రెగ్యులర్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు రూ.125, 3 కంటే ఎక్కువ సబ్జెక్టులు పైన రూ.125, 3 అంతకన్నా తక్కువ సబ్జెక్టులకు రూ.110, ఓకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతో పాటు అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంటుందని డిఇఒ తెలిపారు.

ఉపాధి కల్పించే పరిశ్రమ వస్తే... మీరు తరిమేసారంటే.. మీరు తరిమేసారంటూ అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి చేస్తున్న ప్రత్యారోపణలతో రాప్తాడు నియోజకవర్గంలో రాజకీయ రగడ రాజుకుంది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి బెదిరింపులతో పేజ్ ఇండస్ట్రీస్ (జాకీ) పరిశ్రమ తరలి వెళ్లిందంటూ ఇటీవల మాజీ మంత్రి పరిటాల సునీత ఆరోపణలు చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కూడా పరిశ్రమ స్థలంలోకెళ్లి మంగళవారం నాడు నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో అధికార ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి బుధవారం నాడు మీడియా టూర్ ఏర్పాటు చేసి పరిశ్రమ స్థలంతోపాటు, ఆలమూరులో ఏర్పాటు చేస్తున్న సహకార డైయిరీ చూపించారు. ఈ సమయంలో పరిటాల సునీతపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. పరిశ్రమ తరలి వెళ్లేందుకు ఆమె కారణం అంటూ మండిపడ్డారు. ఇలా రాప్తాడులో గత వారంలో రోజులు విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయం వేడెక్కింది.



రాప్తాడులో రాజకీయ రగడ

- కంపెనీ తరలివెళ్లడంపై రచ్చ
- మీరంటే...మీరని ప్రత్యారోపణలు
- ఇద్దరిలోనూ అభివృద్ధిపై కానరాని చిత్తశుద్ధి
- నియోజకవర్గంలో అనేకేళ్లుగా ఎక్కడి సమస్యలు అక్కడే..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రస్తుతం రాప్తాడు రాజకీయాలు మొత్తం జాకీ పరిశ్రమ చుట్టూ తిరుగుతున్నాయి. టిడిపి హయాంలోనే మాజీ మంత్రి పరిటాల సునీత బంధువుల బెదిరింపులకు 2018లోనే ఆ పరిశ్రమ పోయిందని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చెబుతున్నారు. ప్రకాష్‌రెడ్డి బెదిరింపుల వల్లనే పరిశ్రమ పోయిందంటూ పరిటాల సునీత చెబుతున్నారు. ఇలా గడిచిన నాలుగైదు రోజులుగా నియోజకవర్గంలో పేజ్ ఇండస్ట్రీస్ చుట్టూ రాజకీయ రగడ సాగుతుండటం, అది కూడా పరిశ్రమ తరలివెళ్లటానికి మీరు కారణమంటే.. మీరు కారణమన్న ప్రత్యారోపణలు సాగుతుండటం నియోజకవర్గంతో పాటు జిల్లావాసులు విస్తుపోయి చూసే పరిస్థితి ఏర్పడింది. ఎక్కడైనా అభివృద్ధి మా హయాంలో జరిగిందంటే, మా హయాంలో జరిగిదంటూ వారి కాలంలో జరిగిన అభివృద్ధి గురించి చెప్పుకోవడం పరిపాటి. కాని రాప్తాడులో మాత్రం పరిశ్రమ తరలివెళ్లడానికి కారణంపై చర్చ సాగుతుండటం గమనార్హం. రాప్తాడు నియోజకవర్గంలో అనేక సమస్యలు తిష్టవేశాయి. వీటికి పరిష్కారాలు దశాబ్ధాలుగా లభించడం లేదు. తాగునీటికి సైతం ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ రాజకీయ రగడ జరుగుతున్న సమయంలో మంగళవారం నాడు ఆత్మకూరు మండల కేంద్రంలో కొంత మంది తాగునీటి కోసం రాస్తారోకో చేశారు. అనంతపురం రూరల్ పరిధిలోనూ తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఈ సమస్యకు గడిచిన దశబ్ధకాలంగా పరిష్కారం లభించలేదు. వీటితోపాటు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పేరూరుకు నీరున్నా దిగువకు నీరు వెళ్లదు..!

రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని రామగిరి మండలంలో పేరూరు డ్యామ్ నిర్మాణాన్ని 1950లో పూర్తిచేశారు. ఈ డ్యామ్ పూర్తయినా దిగువ చెరువులకు నీరందించే కాలువలు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. నీరు వెళ్లే పరిస్థితి లేదు. ఈ డ్యామ్‌కు నీరివ్వడంపై దశబ్ధకాలంగా ప్రకటనలు వెలువడుతూనే ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో డ్యామ్‌కు రంగులేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచ్చేసి అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఆ తరువాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డ్యామ్‌కు హంద్రీనీవా నీరిస్తామని ప్రకటించారు. అయితే అదృష్టవశాత్తు ఈ ఏడాది మంచి వర్షాలకు డ్యామ్ నిండి పొంగింది. అయితే ఇప్పటికీ పిల్ల కాలువలు పూర్తవకపోవడంతో నీరు దిగువకు ఇవ్వలేని పరిస్థితి ఉంది.

హంద్రీనీవా ద్వారా ఎత్తిపోతలే....

హంద్రీనీవా ద్వారా ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని పేరూరు డ్యామ్‌కు ఇచ్చేందుకు గత ప్రభుత్వ హయాంలో టెండర్లు పిలిచారు. వీటికి సంబంధించి పనులూ ప్రారంభమయ్యాయి. వైసిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ పేరుతో వాటిని ఆపింది. ఆ తరవాత మూడు రిజర్వాయర్లు అదనంగా చేర్చి నిర్మిస్తామని రెండేళ్ల క్రితం అప్పటి ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అయితే ఆ పనులు ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. భూసేకరణ కూడా పూర్తవకుండానే ఆగిపోయి ఉన్నాయి.

బంగారు గనులు అంతేనా .?

ఎక్కడా లేనటువంటి బంగారు సంపద రాప్తాడు నియోజకవర్గం పరిధిలో ఉంది. మూతపడిన ఈ గనులను తెరిపిస్తామని టిడిపి అధికారంలో ఉండగా అప్పటి మంత్రి పరిటాల సునీత, భూగర్భ గనుల శాఖమంత్రి పీతల సుజాతను రామగిరి పిలిపించి చూపించారు. దీనిని తెరిపించి ఈ ప్రాంతంలో ఉపాధి కల్పిస్తామని హామీనిచ్చారు. అయితే ఐదేళ్లలో అది జరగలేదు. వైసిపి అధికారంలోకి వచ్చాకా ఇటువంటి ప్రకటనలే రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేశారు. విదేశాల నుంచి ప్రతినిధులు వచ్చారంటూ హడావుడి చేశారు. కేంద్రం దేశ వ్యాప్తంగా కొత్త గనుల తవ్వకాలకు పిలిచిన టెండర్లను చూపించారు. అయితే ఇప్పటికి అవి ఏమయ్యాయో తెలీయదు. గనుల మాత్రం మూతపడినవి మూతపడినట్టుగానే ఉన్నాయి. ఇలా రాప్తాడులో ప్రధానమైన సమస్యలన్నీ ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దశాబ్ధాలుగా ఉంటున్నాయి. వాటి పరిష్కారానికి నేతలు దృష్టి సారించకుండా పరిశ్రమలను తరిమివేయడంపై పోటీ పడి విమర్శలు చేసుకుంటూ ఉండడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది.



సత్యసాయిబాబా చిత్రపటంతో పుట్టపర్తిలో కొనసాగుతున్న రథోత్సవం

సంబరంగా సత్యసాయి జయంతి వేడుకలు

- భక్తులు, పర్యాటకులతో పుట్టపర్తిలో సందడి
- ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరు
- వార్షిక బడ్జెట్ విడుదల



జయంతి ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి బాబా 97వ జయంతి వేడుకలు పుట్టపర్తిలో సంబరంగా జరిగాయి. దేశ, విదేశాలకు చెందిన భక్తులు, పర్యాటకులు వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో పుట్టపర్తికి విచ్చేశారు. భక్తులతో సాయి కుల్వంత్‌హాల్ కిటకిటలాడింది. ముఖ్య అతిథిగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హాజరయ్యారు. సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు సభ్యులు వార్షిక నివేదికను విడుదల చేశారు. సత్యసాయి విద్యార్థులు, భక్తులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. పట్టణ పురవీధుల్లో సత్యసాయి సూర్య రథోత్సవం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జయంత్యుత్సవాల సందర్భంగా పలువురు ప్రముఖులు బాబా సమాధిని దర్శించుకున్నారు.

బాబా సేవలు వెలకట్టలేనివి : కిషన్‌రెడ్డి

మానవాళికి సత్యసాయిబాబా అందించిన సేవలు వెలకట్టలేనివని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాడు పుట్టపర్తిలో నిర్వహించిన బాబా 97వ జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా సాయికుల్వంత్ హాల్‌లో సత్యసాయి మహా సమాధిని భార్యతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం జరిగిన జయంతి వేడుకల కార్యక్రమంలో కిషన్‌రెడ్డి ప్రసంగించారు. ప్రభుత్వాలు చేయలేని పనులను సైతం సత్యసాయి సాయి బాబా ప్రజల కోసం చేశారన్నారు. విద్య, వైద్యం, తాగునీరు అందించిన మహనీయుడన్నారు. పుట్టపర్తిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జనరల్ ఆసుపత్రి ద్వారా రోగాలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయంటే అది సత్యసాయి బాబా గొప్పతనం అన్నారు. విలువలతో కూడిన విద్యాను అందించడంలో సత్యసాయి విద్యా సంస్థలు ముందున్నాయన్నారు. గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్న జనం దాహార్తిని తీర్చిన గొప్ప వ్యక్తి బాబా అన్నారు. బాబా చెప్పిన విధంగా 'అందరినీ సేవించు, అందరినీ ప్రేమించు' అనే సూక్తిని ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు.

ట్రస్టు వార్షిక నివేదిక విడుదల

బాబా జయంత్యుత్సవాల సందర్భంగా సత్యసాయి ట్రస్టు వార్షిక నివేదికను కిషన్‌రెడ్డి విడుదల చేశారు. వార్షిక ఆదాయం రూ.200 కోట్లు కాగా వ్యయం 120 కోట్లని నివేదికలో పేర్కొన్నారు. ట్రస్టు కార్యక్రమాలు పారదర్శకంగా ఉంటాయని ప్రతి ఏటా వార్షిక నివేదికను ప్రవేశపెడుతున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ట్రస్టు సభ్యులు ఆర్‌జె.రత్నాకర్, చక్రవర్తి, డాక్టర్ మోహన్, నాగానంద, మాజీ మంత్రులు గీతారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

భక్తులు, పర్యాటకుల సందడి

పుట్టపర్తి రూరల్ : సత్యసాయిబాబా 97వ జయంతి సందర్భంగా పుట్టపర్తి బాబా భక్తులు, పర్యాటకులతో సందడి నెలకొంది. దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు బుధవారం వేకువజాము నుంచే బాబా సమాధిని దర్శించుకున్నారు. జయంతి సందర్భంగా పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో భక్తులకు అన్నదానాలు, ప్రసాదాలను పంపిణీ చేశారు. బాబా చిత్రపటాలు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ వద్ద, సత్యసాయి భక్తులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది సత్యసాయి భక్తులు, ప్రయాణికులు పాల్గొన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద కార్లు, ఆటో డ్రైవర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎయిర్‌పోర్టు రోడ్డు సమీపం, గణేష్ కూడలితో పాటు పట్టణంలో పలు ప్రాంతాల్లో బాబా చిత్రపటాల ఊరేగింపు కొనసాగింది. విద్యాగిరి వద్ద ఫుట్‌పాత్ పై ఏర్పాటు చేసిన వివిధ దుకాణాల వద్ద జనం సందడి కన్పించింది. పట్టణంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పోలీసు, ఆర్టీసీ, మునిసిపల్, పుడా అధికారులు అన్ని ఏర్పాట్లనూ చేశారు.

దర్గాహొన్నూరులో మరో విషాదం

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి



మృతి చెందిన బోయ వాణి

బొమ్మనహాల్ మండలం దర్గాహొన్నూరు గ్రామంలో వరుస విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నెల 2వ తేదీన విద్యుత్ తీగ తెగి ట్రాక్టర్‌పై పడడంతో ఐదుగురు కూలీలు అక్కడికక్కడే మరణించారు. ఇదిలా ఉండగా మంగళవారం నాడు ఓ రైతు పొలం వద్ద 11 కెవి విద్యుత్ తీగ తెగిపడింది. సమీపంలోని రైతులు గుర్తించి విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరాను నిలిపేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. దీనిని మరవక ముందే ఇదే గ్రామంలో ఓ మహిళా రైతు బోయ వాణి(25) బుధవారం ఉదయం విద్యుత్‌షాక్‌తో మరణించింది. పొలం వద్ద విద్యుత్ మోటార్‌ను వేసేందుకు ప్రయత్నించగా అప్పటికే స్టార్టర్ పెట్టెపై సర్వీసు వైరు తెగి పడడంతో షాక్‌కు గురై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. వరుస 'విద్యుత్ షాక్'లతో దర్గాహొన్నూరు గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

ప్రజాశక్తి-బొమ్మనహాల్

పంచాయతీ కార్మికులతో ప్రయివేటు పనులు

అడ్డుకున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి



కార్మికులతో చేయిస్తున్న ప్రయివేటు పనులు

మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులతో ప్రయివేటు పనులు చేయిస్తుండటంతో సిపిఎం నాయకులు అడ్డుకున్నారు. స్థానికమారుతి నగర్‌లో కాంట్రాక్టర్ డ్రయినేజీ పనులు చేయిస్తున్నాడు. అయితే బుధవారం జరుగుతున్న ఆ పనులను పంచాయతీ కార్మికులతో చేయిస్తున్నాడు. ఇది గమనించిన సిపిఎం స్థానిక నాయకులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు లక్షల రూపాయల డ్రైనేజీ పనులను దక్కించుకుని వాటిని పంచాయతీ కార్మికులతో చేయించడం అన్యాయమని అన్నారు. ప్రైవేటు వ్యక్తులకు ఉపయోగించుకొని కాంట్రాక్ట్ డ్రైనేజీ పనులు చేయించాల్సి ఉండగా పంచాయతీ కార్మికులతో చేయించడం ఏమిటని ప్రశ్నించారు. అధికారుల ఉదాసీనత కారణంగానే కాంట్రాక్టర్లు ఈ చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పంచాయతీ కార్మికులను బానిసలుగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పెద్దన్న, మండల నాయకులు వెంకటేష్, హనుమయ్య, రంగప్ప, బాలస్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

లేపాక్షి : సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కాటంబాబు ఆధ్వర్యంలో మండలంలోని గ్రామ రెవిన్యూ అధికారులు, సచివాలయం సర్వేయర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన సబ్‌కలెక్టర్ నూతన పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేసుకొన్నవారికి 15రోజులలోపు మంజూరు చేయాలన్నారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కుమార్‌రెడ్డి, విఆర్ఒలు సుధాకర్ రెడ్డి, రమేష్ బాబు, సురేష్ బాబు, రమేష్, సూర్య నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండల వ్యాప్తంగా ఉన్న భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా మండల రెవెన్యూ అధికారులు పనిచేయాలని సబ్ కలెక్టర్ కార్తిక్ ఆదేశించారు . బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన పలు అంశాలపై మండల రెవెన్యూ అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఎంఆర్ఐ షేక్షావలితో పాటు పరిగి మండల సచివాలయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దేవరచెరువును పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి కదిరి టౌన్

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం డిసెంబర్ 8న నిర్వహించనున్న నేపథ్యంలో రూరల్ పరిధిలోని దేవరచెరువుకట్ట చెరువును స్థానిక ఎమ్మెల్యే పివి. సిద్ధారెడ్డి బుధవారం పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ముళ్ల పొదలను తొలగించాలని, ప్రధాన రహదారి నుండి దేవరచెరువు వరకు గ్రావెల్ రోడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ గోపాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పట్టెం గురుప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, తదితర నాయకులు పాల్గొన్నారు.

హంద్రీనీవా పనులకు నిధులు మంజూరు చేయండి

ప్రజాశక్తి మడకశిర

మడకశిర ప్రాంతంలో అర్ధాంతరంగా ఆగిపోయిన హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని జలవనరుల శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ నారాయణ రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బుధవారం విజయవాడలో జలవనరుల శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌ను కలిసి సమస్యను వివరించారు. పనులు పూర్తి కాకపోవడం మూలంగా కేవలం మడకశిర, గుడిబండ మండలాల్లో కొన్నింటికి మాత్రమే నీరు అందిస్తున్నామని తెలిపారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ నిర్మాణానికి టెండర్లు పిలవడం పూర్తి చేసామని ఆ ప్రక్రియ పూర్తికాగానే త్వరలోనే పనులు చేపట్టి అర్ధంతరంగా ఆగిపోయిన పనులకు నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు చేపడతామని ఇంజనీరింగ్ ఇన్‌ఛీఫ్ పేర్కొన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

అందుబాటులోకి అత్యాధునిక ట్రాక్టర్ యంత్రాలు

ప్రజాశక్తి - పరిగి

రైతులకు వినియోగదారులకు అత్యాధునిక ట్రాక్టర్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చి మెరుగైన సేవలందించే విధంగా కృషి చేస్తామని హిందూపురం మహేంద్ర ట్రాక్టర్స్ ఎఒ అశోక్ కుమార్ అన్నారు. మహేంద్ర ట్రాక్టర్స్, వినాయక మోటార్స్ 13వ వార్షికోత్సవం సందర్భంగా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. 13 సంవత్సరాలుగా తమ సంస్థ ద్వారా ఇటు రైతులకు ఆటు వినియోగదారులకు పలు రకాల పరికరాలతో మెరుగైన యంత్రాలను సమకూర్చామని చెప్పారు. ఇకముందు కూడా మరిన్ని నూతన యంత్రాలను తమ సంస్థ ద్వారా అందుబాటులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వినాయక మోటార్స్ మేనేజర్ మంజునాథ్, శేఖర్, సిబ్బంది మనోహర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.




కేక్ కట్ చేస్తున్న ప్రతినిధులు

పాఠశాలలో పాములు ..!

ప్రజాశక్తిమడకశిర రూరల్

మండల పరిధిలోని ఉప్పిడిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని గదిలో పాములు కలకలం సృష్టించాయి. ఏకంగా నాలుగు పాములు ఒకే చోట బండ కింద ఉండడంతో విద్యార్థులు భయాందోళన చెందారు. పాములను గమనించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు చూసి కేకలు వేశారు. గ్రామస్తుల సహాయంతో హెచ్ ఎం పెద్దిరెడ్డి బండలను తొలగించి ఏడు పాములను చంపి వేశారు. పాఠశాల బయట విపరీతంగా పెరిగిన కంప చెట్లలో నుండి పాములు వచ్చాయని చెపుతున్నారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రహరీ నిర్మించక పోవడం వలనే విషపురుగులు పాఠశాలలోకి ప్రవేశస్తున్నాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.



పాఠశాలలో ఉన్న పాము

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

పుట్టపర్తి రూరల్ : విద్యార్థులు మూఢనమ్మకాలను విడనాడి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని పెడపల్లి ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పెడపల్లి ఉన్నత పాఠశాలలో పాఠశాల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన చేపట్టారు. ఈసందర్భంగా విద్యార్థులు పలు ప్రయోగాలను చేసి ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల సైన్సు ఉపాధ్యాయురాలు రమామని, నరసింహారెడ్డి, గోపాల్ రావు, నిర్మల సహకారంతో అన్ని తరగతుల విద్యార్థులు తయారుచేసిన పలు నమూనాలను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకళ రామమూర్తి, వెంకట రాముడు, చన్న కృష్ణారెడ్డి, మోహన్ బాలాజీ, విష్ణు వర్ధన్, శ్రీనివాసులు, రమాదేవి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈసందర్భంగా విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించిన సైన్స్ మోడల్స్, ప్రాజెక్ట్స్, ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. ఆరు నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న దాదాపు 70 మంది తమకు కేటాయించిన అంశాలపై వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ టీచర్ అంజలీదేవి, ఆదిలక్ష్మి, చంద్రకళ, లక్ష్మీదేవమ్మ, రామంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో నిల్వ ఉన్న మురుగునీరు

పడకేసిన పారిశుధ్యం

రొద్దం : మండలంలోని ఆర్. మరవపల్లిలో పారిశుధ్యం పడకేసింది. సాక్షాత్తూ వార్డు మెంబర్ ఇంటి మందరే మురుగునీరు పేరుకుపోయింది. గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు వెళ్లే కాలువ గడ్డి పెరగడంతో నీరు ముందుకు వెళ్లడం లేదని దీంతో మురుగునీరంతా ఇళ్లముందు నిల్వ ఉంటున్నాయని ఆయా కాలనీలవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కార వేదికలుగా సర్వసభ్య సమావేశాలు

నల్లచెరువు : ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలు సమస్యల పరిష్కారానికి వేదికలుగా ఉండాలని ఎంపిపి రమణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శకుంతల, ఆర్ఐ. దత్త ప్రసాద్‌తో పాటు ఆయా శాఖల అధికారులు, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం తగదు

లేపాక్షి : మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టడంతో నిర్లక్ష్యం వీడాలని డివిజినల్ పంచాయతీ అధికారి శివారెడ్డి సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ నరసింహనాయుడు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డివిజినల్ పంచాయతీ అధికారి మాట్లాడుతూ పంచాయతీలలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై సత్వరమే స్పందించాలని సూచించారు. ఈసమావేశంలో ఇఒఆర్‌డి శివన్న, పంచాయతీ కార్యదర్శులు నాగేంద్ర, శివ, భాస్కర్, రామాంజనేయులు, ఆనంద్ కుమార్, రమేష్‌బాబు, దుర్గయ్య, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

మడకశిర : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన భూహక్కు విధానంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహాశీల్దార్ ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు బుధవారం ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటు వస్తున్న భూములకు అధికారిక ఆమోదం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఫణీంద్ర, ఎంపీడీవో నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చేయూత

సోమందేపల్లి : మండల కేంద్రంలోని పలు కాలనీలో గల పేద మహిళా వృద్ధులకు అదే గ్రామానికి చెందిన ఆర్యవైశ్యుడు శ్రీధర్ బుధవారం చేయూతను అందించాడు. వృద్ధ మహిళలకు చీర, వందరూపాయలు అందజేశాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ శ్రీధర్ సేవా గుణాన్ని కొనియాడారు. కరోనాకాలంలో అనేకమంది పేదలకు నిత్యావసర వస్తువులు అందజేశారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు పలుమార్లు పౌష్టికాహారం అందజేశాడన్నారు. నేటి యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాడని చెప్పారు.

కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా బత్తల కదిరప్ప

కనగాన పల్లి : కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా శ్రీ సత్యసాయి జిల్లా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బత్తల కదిరప్పను ఎన్నుకున్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో ఈనెల 21 22 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌలురైతుల సంఘం రాష్ట్ర తృతీయ మహాసభలు జరిగాయి. ఇందులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా నుండి రాష్ట్ర కమిటీకి బత్తల కదిరప్పను కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీలో సభ్యుడిగా ఎన్నుకున్నారు.

కురుబల ఐక్యతను చాటుదాం

ధర్మవరం టౌన్ : ఈనెల 27న పుట్టపర్తిలో నిర్వహించనున్న మహాసభలో కురుబల ఐక్యతను చాటుకుందామని కురుబసంఘం నాయకులు పేర్కొన్నారు. ధర్మవరంలోని లక్ష్మీ చెన్నకేశవ పురంలోగల కురుబ కల్యాణమండపంలో కురుబల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కురుబ సంఘం నాయకులు సామకోటి ఆదినారాయణ, మాలగుండ్ల మల్లికార్జున, కప్పలబలరాం తదితరులు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా జిల్లాలోని కురుబలందరూ మహాసభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కురుబసంఘం నాయకులు బండి ఉజ్జినప్ప, కోటివెంకటేష్, గెలిమి పెద్దన్న, కపాటం ఈశ్వరయ్య, గవ్వల నారాయణస్వామి, కోటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలధరను పెంచిన 'అమూల్'

కదిరి టౌన్: జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా పాలు సేకరిస్తున్న అమూల్ డెయిరీ పాడిరైతుల నుంచి సేకరించే పాల ధరలను పెంచినట్లు డెయిరీ ఇన్‌ఛార్జి ఉదయక్‌కుమార్ తెలిపారు. వరుసగా మూడోసారి ధరలను పెంచినట్లు చెప్పారు. పెరిగిన ధరలు రాయలసీమ ప్రాంతంలోని అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి, వైఎస్‌ఆర్ కడప, తిరుపతి జిల్లాలకు వర్తిస్తుందన్నారు.

ఉపాధిపనులపై గ్రామసభ

అమడగూరు : ఉపాధి పనులను మండలంలోని చినగానిపల్లి పంచాయతీలో బుధవారం ఏపీవో అమరావతి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. 2020-21 ,2021-2022 వ సంవత్సరంలో జరిగిన 122ఉపాధి హామీ పనులపై ఉపాధి కూలీలతో బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ ఆనంద్, డిఆర్‌పి సంజన, ఎస్ఆర్‌పి లక్ష్మన్న, పీఎస్ నాగేంద్ర, టిఎ వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్లు,మెట్లు,ప్రజలు పాల్గొన్నారు.

వేలంపాటలో రూ.25 వేల ఆదాయం

హిందూపురం : పట్టణంలో పురపాలక సంఘ వారు నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య భవన సముదాయం, కూరగాయాల మార్కెట్ పరిసర ప్రాంత రోడ్డు మార్జిన్‌లో 120 ద్విచక్ర వాహనాలను పార్కింగ్ నిర్వహణ కోసం వేలంపాలను బుధవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యలయ ఆవరణంలో బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. పురపాలక సంఘం రూ.2.16లక్షలు నిర్ణయించగా తంజుల తబసుమ్ అనే వ్యక్తి రూ.2.41లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. దీంతో పురపాలక సంఘం వారు నిర్ణయించిన ధర కంటే రూ.25వేలు వచ్చింది. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారి రంగరావు, ఆర్ఐ రాము తదితరులు పాల్గొన్నారు.

తీరుమార్చుకోని విద్యుత్‌శాఖ



చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

ప్రజాశక్తి తనకల్లు

ఉమ్మడి జిల్లాలో ఇటీవల కాలంలో వరుసగా విద్యుత్ ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడినా ఆ శాఖలోని పలువురి అధికారులు నిర్లక్ష్యం వీడలేదు. తనకల్లు మండలంలో పలుచోట్ల విద్యుత్‌తీగలు ప్రమాదకరంగా ఉన్నా ఆశాఖ అధికారులు పట్టించుకోవటం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే గాని అధికారులు స్పందించరా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని కోటూరు వద్ద గల సబ్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో జాతీయ రహదారి పక్కనే ప్రమాదకర స్థాయిలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ఈ తీగల కింద ఆవులు, గేదెలు వెళితే తగిలే విధంగా ఉన్నాయి. జాతీయ రహదారికి సమీపంలో ఇలాంటి పరిస్థితి ఉంటే ఇక మారుమూల గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇన్‌ఛార్జి ఎఇ విధి నిర్వహణలో వహిస్తున్న నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏదో ఒక చోట విద్యుత్ బారిన పడి ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నా కూడా విద్యుత్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదాలను నివారించాలని వారు కోరుతున్నారు.

వీధి మధ్యలో విద్యుత్ స్తంభం : మండల కేంద్రంలోని తారకరామ నగర్ లో వీధి మధ్యలో విద్యుత్ స్తంభం ప్రమాదకర స్థాయిలో ఉంది. అత్యవసర సమయాలలో కనీసం 108 రావడానికి కూడా ఆస్కారం లేని పరిస్థితి ఇక్కడ నెలకొంది. ఇదే వీధి గుండా నిత్యం 2 ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు తిరుగుతూ ఉంటారు. ఈ సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని అక్కడినుండి పక్కకు తొలగించి దారి సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్‌స్తంభం



చంద్రబాబుతో మాట్లాడుతున్న తెలుగుతమ్ముళ్లు

చంద్రబాబును కలిసిన తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గంలో టిడిపిలో తలెత్తిన తాజా రాజకీయ పరిస్థితులను పార్టీ అదినేత నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానిక తెలుగు తమ్ముళ్లు తెలిపారు. సత్య సాయి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎన్ మంజునాథ్. తాలూకా బీసీ సెల్ అధ్యక్షుడు తిప్పేస్వామి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నరేష్ (కన్నా), కేంకర నారాయణప్ప తదితరులు విజయవాడలో టిడిపి రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడిని కలిసి స్థానిక సమస్యలపై వివరించినట్లు వారు తెలిపారు. కుమ్మక్కు రాజకీయాలను సహించేది లేదని ధైర్యంగా ముందుకు వెళ్లి పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని చంద్రబాబు తమను ఆదేశించినట్లు వారు తెలిపారు.

మంత్రి చేతుల మీదుగా బ్యాగులు ఆవిష్కరణ

ప్రజాశక్తి, కదిరి టౌన్

జగన్మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలను చైతన్య పరిచేవిధంగా వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ తయారు చేయించిన జగన్మోహన్ రెడ్డి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫోటోలతో కూడిన బ్యాగులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. బుధవారం తిరుపతిలో మంత్రి స్వగృహంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బత్తలహరిప్రసాద్, బత్తల యువసేన నాయకులు ముబారక్, పవన్, జోక్షన్, ప్రతాప్, యశ్వంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాగులు ఆవిష్కరిస్తున్న మంత్రి

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు



సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

కొత్తచెరువు : కొత్త చెరువులో శ్రీ సత్య సాయి బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శాఖ గ్రంథాలయంలోనూ, నాలుగు రోడ్ల కూడలిలో, సహకార బ్యాంకు, సత్యసాయి భజన మందిరంలో, ధర్మవరం రోడ్డులో సిమెంట్ బ్రిక్స్ వద్ద సత్యసాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి భక్తులు మెడికల్ స్టోర్ సుబ్రహ్మణ్యం, కొండమీద రాయుడు, ఎలమందల రవి, నాగేంద్ర, ఎడిసిసి బ్యాంక్ మేనేజర్ ఉమాపతి, అసిస్టెంట్ మేనేజర్ సునీత, గ్రంథాలయ అధికారి జయరాం, డాక్యుమెంట్ రైటర్ సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక మూడు రోడ్ల కూడలి నందు పుట్టపర్తి సత్య సాయిబాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఊరేగింపు నిర్వహించారు.

బత్తలపల్లి : సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని మండలంలోని సత్యసాయి వాటర్ ట్యాంకుల వద్ద బాబా చిత్రపటాలకు ప్రజలు పూజలు నిర్వహించారు. ఆనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


నల్లమాడ : మండల పరిధిలోని వేళ్ళ మద్ది గ్రామంలో బుధవారం పుట్టపర్తి సత్యసాయిబాబా జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామానికి చెందిన సత్యమ్మ దేవత భజన బృందం అధ్యక్షులు సూర్యనారాయణ వెంకటరమణ, గ్రామస్తుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. స్థానిక రామాలయంలో బాబా చిత్రపటాన్ని అలంకరించి భజనలు చేశారు. అనంతరం బాబా చిత్రపటాన్ని ఊరేగించారు.

తాడిమర్రి : స్థానిక సత్యసాయి వాటర్ పంప్ హౌస్ లోని సిఐటియు కార్మిక అనుబంధ సంస్థ కార్మికులు బుధవారం సత్యసాయి జయంతిని నిర్వహించారు. సత్యసాయిబాబా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, ఓబులేసు, సుధాకర్, చిన్న ఓబులేసు, మహేశ్వర్ రెడ్డి, తిరుపాలు ఆచారి తదితర కార్మికులు పాల్గొన్నారు

చెన్నేకొత్తపల్లి : మండలంలోని మేడాపురం, వెంకటంపల్లి గ్రామాల్లో శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు, శ్రీ సత్యసాయి బాబా వాటర్ ట్యాంక్ క్రింద ఏర్పాటు చేసిన శ్రీ సత్య సాయిబాబా విగ్రహం కు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కదిరి టౌన్ : ప్రజాసంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కదిరి రూరల్ మండలం, కాలసముద్రం గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న తన పాలనలో విద్య, వైద్యం, సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఇంద్రారెడ్డి, జెడ్పీటీసీ రాధాబాయి, సర్పంచి లలితమ్మ, ఎంపీటీసీ ఓబులమ్మ, వైస్ ఎంపీపీ ఆనంద్ నాయక్, మండల కన్వీనర్ ప్రకాష్, జిల్లా అగ్రిగోల్డ్ మెంబర్ సుధీర్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, టెంపుల్ చైర్మన్ గోపాలకష్ణ, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు, ఎంపీడీవో సుధామణి, ఎస్ఎండి ఇస్మాయిల్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి -పెనుకొండ

నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం క్రాస్ నందు నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ వంశీకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇస్లాపురం క్రాస్ నందు దాదాపుగా 15 ఇళ్లలో గత 30 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్నారని అప్పటినుండి నీటి కొరత లేదని అన్నారు. ఇప్పుడు 15 రోజుల నుంచి నీటి సరఫరా లేక మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు స్పందించి నీటిని సరఫరా చేయాలని కోరారు. నేటినుంచి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రమేష్, టిడిపి మైనార్టీ నియోజకవర్గ ప్రెసిడెంట్ రియాజ్, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, సౌమ్య, నాగలక్ష్మమ్మ, జరిన్ తాజ్, తిప్పమ్మ, షబ్బీర్, సత్యక్క, శ్రీనివాసులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.




వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గొర్రెల కాపరులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - కొత్తచెరువు

ప్రభుత్వపరంగా అన్ని విధాల గొర్రెల కాపరులను ఆదుకుంటామని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, పుట్టపర్తి ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం లోచర్ల సమీపాన రైల్వే ట్రాక్ వద్ద జరిగిన ప్రమాదంలో గొర్రెలు మృతిచెందిన నేపథ్యంలో బాధిత గొర్రెలకాపరులను వారు బుధవారం పరామర్శించారు. ప్రమాదంలో 120 గొర్రెలు మృతిచెందాయని దాదాపు రూ. 12 లక్షల వరకు నష్టం వాటిల్లిందని తమను ఆదుకోవాలని బాధితులు వారిని కోరారు. గొర్రెలకు బీమా వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎటి మల్లేష్‌గౌడ్‌ను ఎంపీ, ఎమ్మెల్యే ఆదేశించారు. తక్షణ సాయం కింద బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీలు గాయత్రి రెడ్డప్ప రెడ్డి, రమణారెడ్డి. వైస్ ఎంపీపీ గంగరాజు, నాయకులు విజయభాస్కర్, సర్పంచి గంగులమ్మ తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

జనసేనపార్టీని రౌడీసేన అనడం జగన్‌కు తగదు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రాష్ట్రంలో ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో సహనం కోల్పోయిన సిఎం జగన్మోహన్‌రెడ్డి జనసేన పార్టీపైనా, పార్టీ అధ్యక్షుడిపైనా నోరు పారేసుకుంటున్నారని జనసేనపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మదుసూదన్ రెడ్డి విమర్శించారు. బుధవారం సాయంత్రం తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్. జగన్ జనసేనపార్టీ అధినేతపైనా, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం పద్ధతికాదన్నారు. ప్రజలలో ఎందుకింత వ్యతిరేకత ఉందో తెలుసుకోకుండా సహనం కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. తమ పార్టీని రౌడీసేన అని విమర్శించడం సిఎం జగన్‌కు తగదన్నారు. రాష్ట్రంలో రౌడీయిజం, దందాలు, అక్రమాలు, దౌర్జన్యాలు చేస్తోంది ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు.. రాష్ట్రంలో రోడ్లన్నీ గుంతలమయంగా మారి ప్రయాణించడానికే ప్రజలు నరకయాతన చేస్తున్నారని, వీటిని సోషియల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేశామని చెప్పారు. జగనన్న కాలనీల్లో అక్రమాలు, అవినీతిని ఎత్తి చూపామని, అందుకే తమ పార్టీపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. పరి పాలన చేతకాకపోతే ఎవరినైనా పలహాదారుడిని పెట్టుకోవాలని సూచించారు. ఇకనైనా జగన్ తన స్థాయిని దిగజార్చుకునే మాటలు మాట్లాడవద్దని హితవు పలికారు.



మాట్లాడుతున్న 'చిలకం'

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు... కదిరి వైపు నుండి వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఎదురుగా ఉన్న రెండు ఆటోలను ఢీకొంది. ఈ ప్రమాదంలో మండల పరిధిలోని మార్యారివాండ్లపల్లికి చెందిన సుబ్బారాయుడు (60), ఉస్తినిని పల్లికి చెందిన షేక్ హుస్సేన్ (30) తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మించలవారి కోటకు చెందిన రమణ (40)అనే ద్విచక్ర వాహనదారుడికి రెండు కాళ్లు విరిగాయి. అతడిని చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంభూపాల్ యాదవ్ తెలిపారు.



రోడ్డు ప్రమాద దృశ్యం

కర్నాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు : కొడికొండ చెక్‌పోస్టు వద్ద సెబ్ అధికారులు బుధవారం నిర్వహించిన తనిఖీలలో కర్నాటక నుండి అక్రమంగా తరలిస్తున్న 150 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి హిందూపురం సెబ్ స్టేషన్ కు తరలించినట్లు ఎస్ఐ ఓంసింహ హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక చర్యలు

హిందూపురం : హిందూపురం పట్టణ వ్యాప్తంగా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వన్‌టౌన్ సిఐ ఇస్మాయిల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్‌రిజిస్టర్ కార్యాలయం ముందు, ఆర్‌పిజిటి రోడ్డులో ట్రాఫిక్‌ను నియంత్రించడానికి బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతు ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



బారికేట్లు ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు

ఎమ్మెల్సీని సన్మానించిన ఖాజీలు

హిందూపురం : అనాదిగా హిందూపురం పట్టణంలో ఖాజీల వ్యవస్థ లేదు. ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అధికారులతో చర్చించి, హిందూపురం పట్టణానికి ఇద్దరు ఖాజీలను నియమించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నియమించిన ఖాజీలు, పట్టణంలోని వివిధ మసీదుల్లో పని చేస్తున్న మౌలానాలు, ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్లు అయూబ్, రోషన్ అలీ, బాబు, పట్టణంలోని ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో కంటి వైద్యపరీక్షలు

నల్లచెరువు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి కంటి వైద్య నిపుణురాలు ఎస్ యాస్మిన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా దృష్టిలోపాలు ఉన్నవారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ శిరీష, ఎఎన్ఎం మేరీ, సచివాలయ ఎఎన్ఎం లలిత, ఆశా కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్ఐకు డీటీగా ఉద్యోగోన్నతి

కదిరి టౌన్ : కదిరి తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న మున్వర్‌కు డిప్యూటీ తహశీల్దార్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం స్థానిక ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన స్థాయిని పెంచాలి

బుక్కపట్నం : విద్యార్థులలో అభ్యసన స్థాయిని పెంచే విధంగా విద్యాబోధన జరగాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలలో డిఆర్‌పి , ఉపాధ్యాయులకు జరుగుతున్న ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడం కోసం యునెస్ ఎఫ్, సీఐపీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఇఒ మీనాక్షి, డైట్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, రాష్ట్ర పరిపాలన అధికారి వెంకటరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్లు నాగరాజు, వెంకటేశ్వర ప్రసాద్, డైట్‌అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌జెడి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సర్పంచి, ఫారెస్టు అధికారులు

అడవిజంతువుల నుంచి రక్షణ కల్పిస్తాం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - గుడిబండ

అడవిజంతువుల నుంచి ప్రజలకు రక్షణ కల్పిస్తామని ఫారెస్టు అధికారులు హామీ ఇచ్చారు. గుడిబండ కొండలో కొద్ది రోజుల నుంచి చిరుత, ఎలుగుబంట్ల సంచారం ఎక్కువగా ఉండటంతో ప్రజాశక్తి దినపత్రికలో 'గుడిబండ కొండలో చిరుత సంచారం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మడకశిర ఫారెస్ట్ అధికారులు స్పందించారు. ఈ మేరకు వారు బుధవారం గుడిబండకు వచ్చి స్థానిక సర్పంచ్ కరుణాకర్‌తో చర్చించారు. గ్రామస్తులతో మాట్లాడారు. చిరుత ఎలుగుబంట్లు సంచారాన్ని నివారించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వాటిని బంధించి మరో చోటికి తరలించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.